క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాలకు ఫ్యాన్లు బహూకరణ



కూళ్లలో అంగన్‌వాడీ కేంద్రానికి ఫ్యాన్లు బహూకరిస్తున్న దాత జాన్‌ప్రసాద్

కె.గంగవరం: మండల పరిధిలోని కూళ్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు శుక్రవారం దాతలు సీలింగ్ ఫ్యాన్లను బహూకరించారు. గ్రామానికి చెందిన లక్కోజు జాన్‌ప్రసాద్ రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు ఉచితంగా ఫ్యాన్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాన్లు లేక చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి బహూకరించినట్టు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టిక ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నందిగం సురేష్ అరెస్ట్ దారుణం



కౌన్సిలర్ రవి

మండపేట: మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ విభాగం అధ్యక్షుడు నందిగం సురేష్ అరెస్టు దారుణమని 8వ వార్డు కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ అన్నారు. మాజీ ఎంపీ సురేష్ అరెస్టుపై శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగా కావాలనే కుట్ర పూరితంగా సురేష్‌ను అరెస్టు చేశారన్నారు. కూటమి నాయకుల ఎన్ని కుట్రలు పన్నినా తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రజల తరఫున ప్రజా క్షేత్రంలో పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. తక్షణం సురేష్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఆహారం శాస్త్రబద్ధంగా ఉండాలి



వెదురుమూడిలో సీమంతం చేస్తున్న అధికారులు

కపిలేశ్వరపురం: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీసుకునే ఆహారం శాస్త్రీయంగా ఉండాలని ఐసీడీఎస్ మండపేట ప్రాజెక్ట్ అధికారి అధికారి గజలక్ష్మి అన్నారు. మండలంలోని వెదురుమూడిలో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. గజలక్ష్మి మాట్లాడుతూ పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా ఉండడం ద్వారా సామాజిక ఆరోగ్యం ఆధారపడి ఉంటుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. గర్భిణులకు సీమంతం చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.వెంకటలక్ష్మి, అంగన్‌వాడీలు ఎం.జానకీదేవి, బి.నాగమణి, బి.నిర్మల, వి.శ్రీలక్ష్మి, మహిళా పోలీస్ ప్రమీల, కార్యదర్శి శారద, ఎంఎల్‌హెచ్‌పీ మానిక పాల్గొన్నారు.

మోతాదు మించితే ముప్పు

రామచంద్రపురం రూరల్: పంటలు సాగు చేసిన రైతులు మోతాదుకు మించి పురుగు మందులను వాడితే పంటకు నష్టం కలుగుతుందని ఏడీఏ రంగారావు అన్నారు. మండలంలోని హసన్‌బాద రైతు సేవా కేంద్రంలో గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు అధ్యక్షతన పంట సాగులో తెగుళ్ల నివారణ, పురుగు మందుల వాడకం, ఈ–కేవైసీ తదితర అంశాలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్, ఏడీఏ రంగారావు, జిల్లా రిసోర్స్ సెంటర్ ఏఓ మనోహర్ రైతులకు తెగుళ్ల నివారణ, పురుగు మందుల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ కోట ధరణి, వార్డు సభ్యుడు చోడిశెట్టి పాండురంగారావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు వివాదానికి తెర

మండపేట: మండపేట ఫ్లై ఓవర్ జంక్షన్‌లో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు వివాదానికి శాంతియుత పరిష్కారం కనుగొన్నారు. అధికారులు, గ్రామ పెద్దలు శుక్రవారం చేసిన శాంతి ప్రయత్నాల వల్ల నాలుగు రోజులుగా సాగుతున్న వివాదం సమసి నట్టయ్యింది. ద్వారపూడి పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఈతకోట కిన్నెర ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి వార్డు సభ్యులు, పెద్దలు, పంచాయతీ అధికారులు హాజరయ్యారు. స్థానిక ఫ్లై ఓవర్ జంక్షన్ వద్ద ప్రస్తుతానికి ఎటువంటి విగ్రహాలు ఏర్పాటు చేయకుండా, ఆ కూడలిలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఒకవేళ విగ్రహం ఏర్పాటు చేయాల్సి వస్తే ఎవరికీ ఇబ్బంది లేని ప్రాంతంలో నెలకొల్పేలా చర్యలు తీసుకుందామని తెలిపారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొనేందుకు అందరూ సంయమనం పాటించాలని కోరారు. కాగా రామచంద్రపురం ఆర్డీవో సుధాకర్, డీఎస్పీ రామకృష్ణలు గ్రామంలో శాంతి వాతావరణం తెచ్చేందుకు చేసిన వారి ప్రయత్నాలు తెలిసిందే. శుక్రవారం నాటి సమావేశంలో ఎంపీడీవో సత్యనారాయణమూర్తి, ఈవోపీఆర్డీ ఐదం రాజు తదితరులు పాల్గొన్నారు.

చవితికి సర్వం సిద్ధం

- గ్రామాల్లో గణపతి నవరాత్రుల సందడి
- నేడు వినాయక చవితి
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీలు



రామచంద్రపురంలో పూజా సామగ్రి కొనుగోళ్లతో రద్దీగా మారిన రోడ్లు

రామచంద్రపురం: గ్రామాల్లో వినాయక చవితి సందడి నెలకొంది. నియోజకవర్గంలోని రామచంద్రపురం పట్టణంతో పాటు రూరల్, కె.గంగవరం, కాజులూరు మండలాల్లో గణపతి నవరాత్రులను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఎవరికి వారు తమ ఇళ్లను, వ్యాపార సంస్థలను, వాహనాలను శుభ్రం చేసుకుంటూ బిజీబిజీగా గడిపారు. గణేశ్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో వాడవాడలా ప్రత్యేక మందిరాలను ఏర్పాటు చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. చలువ పందిళ్లు ఏర్పాటు చేసి భారీ గణపతి విగ్రహాలను నెలకొల్పేందుకు పోటాపోటీగా ఏర్పాట్లు చేశారు. మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతులు, రంగురంగుల కాగితపు పూల దండలతో ప్రత్యేకంగా అలంకరించారు.

కిటకిటలాడిన ప్రధాన రహదారులు

చవితి పూజా సామగ్రిని కొలుగోలు చేసేందుకు భక్తులు భారీగా రామచంద్రపురం మార్కెట్‌కు తరలివచ్చారు. ప్రధాన రహదారులన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని ప్రధాన రహదారిని ఆనుకుని పలు చోట్ల పూజా సామగ్రి దుకాణాలను ఏర్పాటు చేశారు. వాహనాలకు కట్టే ప్లాస్టిక్ పూలు దండలను భక్తులు కొనుగోలు చేసేందుకు వీలుగా వ్యాపారస్తులు ఆయా షాపుల వద్ద వేలాడదీశారు. పూజ సామగ్రి కొనుగోలుకు పట్టణం, పరిసర గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో పట్టణంలోని ప్రధాన రహదారి కిటకిటలాడింది.

వరసిద్ధి వినాయక మందిరం వద్ద ఏర్పాట్లు పూర్తి

పట్టణంలోని ప్రధాన రహదారి డఫేదారు సెంటర్‌లో వరసిద్ధి వినాయక మందిరం వద్ద బాల భక్త సమాజం ఆధ్వర్యంలో చవితి వేడుకలను నిర్వహించనున్నారు. ఈ మేరకు డఫేదార్ సెంటర్‌లో నిర్వాహకులు ఏర్పాట్లను పూర్తి చేశారు. మొదటి నుంచి భారీ మట్టి విగ్రహాన్ని తయారు చేసి నెలకొల్పటం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. నిమజ్జన వినాయకుని విగ్రహానికి వెండి ఆభరణాలను పెట్టడం ఇక్కడే తొలిసారి. జిల్లాలో మొట్టమొదటి సారిగా వినాయకుని మాల ధరించింది ఈ గణపతి వద్దనే. గణపతి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా డఫేదారు సెంటర్‌లో నెలకొల్పిన స్వామివారికి ప్రత్యేక పూజలు వ్రతాలను నిర్వహించనున్నారు. తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మండపేట మార్కెట్‌కు చవితి కళ

మండపేట: గణపతి నవరాత్ర ఉత్సవాలకు ఊరూవాడా సిద్ధమైంది. పట్టణంతో పాటు గ్రామాల్లోనూ శనివారం తెల్లవారుజాము నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. వాడవాడలా గణేశుని మంటపాలు వెలిశాయి. ప్రతి చోటా రంగురంగుల విద్యుత్ దీపాలు అమర్చారు. మరోపక్క పూజా సామగ్రి విక్రయ దుకాణాలతో మండపేట మార్కెట్ శుక్రవారం కళకళలాడింది. వివిధ ప్రాంతాల నుంచి చిరు వ్యాపారులు సైకిళ్లపై పత్రి తెచ్చి అమ్ముతున్నారు. గణపతి పూజకు ఉపయోగించే పత్రి, పలురకాల పండ్లు, పాలవెల్లి, పూల దుకాణాలతో కేపీ రోడ్డు కిక్కిరిసింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పట్టణానికి తరలి వచ్చారు. కొనుగోలుదారులతో కేపీ రోడ్డు కిటకిటలాడింది. జామ, మామిడి, వెలగ, జొన్నపొత్తులు, బత్తాయిలు, నారింజ, యాపిల్, పంపర పనస పండ్ల ధరలు సాధారణ రోజుల కంటే కొంత ఎక్కువ రేటే పలికాయి. ఇళ్లలో వినాయక పూజకు ఉపయోగించే వివిధ రూపాల్లోని వినాయక ప్రతిమల దుకాణాలు విరివిగా ఏర్పాటు చేశారు. చిరు వ్యాపారులు కడియపులంక నుంచి హోల్‌సేల్‌గా చామంతి, బంతి, గులాబి పూలు తెచ్చి పట్టణంలో రిటైల్‌గా అమ్మకాలు జరిపారు. మండపాలు, వాహనాలకు ప్రత్యేకంగా అలంకరించడానికి రంగురంగుల చమ్కీ దండలు కొనడానికి కూడా భక్తులు ఎగబడ్డారు. పది రోజులుగా అల్పపీడనం ప్రభావంతో వర్షాలు పడి వాతావరణం జనజీవనాన్ని స్తంభింపజేసినప్పటికీ శుక్రవారం మాత్రం వరుణుడు కరుణ చూపాడు. దీంతో పూజాసామగ్రి వ్యాపారాలు జోరుగా సాగాయి. కాగా కేపీ రోడ్డు, మెయిన్ రోడ్డు, వల్లూరి వారి వీధి, వాణీమహల్, మున్సిపల్ కార్యాలయం రోడ్డులో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా టౌన్ ఎస్‌ఐ హరికోటి శాస్త్రి కానిస్టేబుళ్లచే బందోబస్తు నిర్వహించారు.



రాయవరం బస్టాండ్ సెంటర్‌లో పూజాసామగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులు

రాయవరం మండలంలో..

రాయవరం: చవితి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు మండలంలో ముమ్మరంగా ఏర్పాట్లు చేశారు. గ్రామాల్లో గురువారం నుంచే మార్కెట్లు కిటకిటలాడాయి. స్వామివారి ఆలయాలు, మండపాలు ముస్తాబయ్యాయి. ఆలయాల వద్ద వినోద, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణకూ ఏర్పాట్లు చేశారు.

మండలంలోని రాయవరం, లొల్ల, వెదురుపాక, వి.సావరం, వెదురుపాక, నదురుబాద, సోమేశ్వరం, మాచవరం పసలపూడి, చెల్లూరు, వెంటూరు, కూర్మాపురం, కురకాళ్లపల్లి గ్రామాల్లో చవితి వేడుకలకు మండపాలు ఏర్పాటు చేశారు. రాయవరం, మాచవరం, పసలపూడి గ్రామాల ప్రధాన సెంటర్లలో పూజా సామగ్రి స్టాల్స్ ప్రధాన రహదారులను ఆనుకుని ఏర్పాటు చేశారు. చవితి పూజలకు ఉపయోగించే పండ్లు, పూలు, వివిధ రకాల పత్రి, బెల్లం, కూరగాయలు, అరటిపండ్ల ధరలను పెంచి వ్యాపారులు విక్రయించారు.

ప్రధాన కూడళ్లలో వెలసిన మంటపాలు

మండలంలోని పలు గ్రామాల్లో వేడుకలు తొమ్మిది రోజుల పాటు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద తాత్కాలిక మంటపాలు ఏర్పాటు చేశారు. మంటపాల్లో శనివారం ఉదయం స్వామి వారి విగ్రహాలను ప్రతిష్ఠించడానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. వివిధ గ్రామాల నుంచి స్వామి వారి విగ్రహాలను ట్రాక్టర్లు, ఇతర వాహనాలపై తరలిస్తూ కన్పించారు.

కాజులూరు: గణపతి నవరాత్ర వేడుకలకు సర్వం సిద్ధమైంది. శనివారం వినాయక చవితి కావడంతో గ్రామాల్లో ఇప్పటికే చలువ పందిళ్లు వేసి మండపాలను సిద్ధం చేశారు. మంటపాల వద్ద విద్యుత్ దీపాలంకరణలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని గ్రామాల్లో ప్రధాన కూడళ్లు, ఆటో, ట్యాక్సీ స్టాండ్ల వద్ద భారీ విగ్రహాలను నెలకొల్పేందుకు మంటపాలు వేశారు. మండలంలోని గొల్లపాలెం, కాజులూరు, జగన్నాథగిరి, కోలంక తదితర ప్రధాన గ్రామాల్లో మార్కెట్లు శుక్రవారం వినాయక చవితి శోభను సంతరించుకున్నాయి. భక్తులు గణపతి విగ్రహాలు, పత్రి, పూలు, పండ్లు కొనుగోలు చేశారు.



గొల్లపాలెం మార్కెట్‌లో పత్రి, పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులు

ఆకట్టుకుంటున్న మంగళ బాంధవ్య గణపతి

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్ గణిత ఉపాధ్యాయిని వాడ్రేవు భాను గాయత్రి గడచిన కొన్ని సంవత్సరాలుగా వినాయక చవితి పురస్కరించుకుని విభిన్నంగా వినాయకుని చిత్రాలను రూపొందిస్తున్నారు. దీనిలో భాగంగా ఈ ఏడాది వరలక్ష్మీ అమ్మవారి వద్ద ఉంచిన మాంగళ్య తోరణాలతో వినూత్నంగా గణపతిని రూపొందించి ఔరా అనిపించుకున్నారు. అలాగే ద్రాక్షారామకు చెందిన 5వ తరగతి విద్యార్థిని నరాల కావ్య శ్రీసాయి సుధ క్లేతో రూపొందించిన గణపతి చూపరులను ఆకర్షిస్తోంది.



మంగళ బాంధవ్య గణపతితో ఉపాధ్యాయిని భానుగాయత్రి



చిన్నారి కావ్య శ్రీసాయి సుధ రూపొందించిన క్లే గణపతి



కావ్య శ్రీసాయి సుధ

మట్టితోనే మనుగడ

- పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన
- గ్రామాల్లో జోరుగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



కోటిపల్లిలో మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసిన విద్యార్థులు

కె.గంగవరం: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించాలని విద్యార్థులు, అధికారులు కోరారు. వినాయక చవితిని పురస్కరించుకుని మండలంలోని సత్యవాడ, కోటిపల్లి, కె.గంగవరం తదితర గ్రామాల్లో శుక్రవారం మట్టి విగ్రహాల వినియోగంపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో విద్యార్థులు ప్లకార్డులతో నినాదాలు చేస్తూ మట్టి విగ్రహాల వల్ల జరిగే మేలును ప్రజలకు వివరించారు. కె.గంగవరంలో జరిగిన ర్యాలీలో తహసీల్దార్ సూర్యారావు, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల వలన జల కాలుష్యం జరిగి జలచరాలకు ముప్పు వాటిల్లుతుందన్నారు. తద్వారా వివిధ రకాల అంటు రోగాలు, క్యాన్సర్, చర్మవాధులు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరు తప్పని సరిగా మట్టి విగ్రహాలను పూజించి నిమజ్జనం చేయాలని కోరారు. కె.గంగవరం, కోటిపల్లిలో విద్యార్థులే స్వయంగా సుమారు 200 మట్టి వినాయ విగ్రహాలను తయారు చేసి ప్రజలకు అందించారు.

కాజులూరులో..

కాజులూరు: వినాయక చవితికి ప్రతిఒక్కరూ తప్పనిసరిగా మట్టి విగ్రహాలనే పూజించాలని మండల విద్యాశాఖాధికారి ఎస్.డేవిడ్ కోరారు. కాజులూరులో జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం పంపన కృష్ణమూర్తి, స్థానిక శ్రీకోటి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులు గ్రామంలో ర్యాలీ చేసి మట్టి విగ్రహాల వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రజలకు విద్యార్థులు తయారు చేసిన మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు.

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు శనివారం మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. జనవిజ్ఞాన వేదిక రామచంద్రపురం రూరల్ అధ్యక్షుడు, దంత వైద్యుడు డాక్టర్ బచ్చు క్రాంతికుమార్, నాగేషుకుమారి దంపతుల ఆధ్వర్యంలో 500 మందికి మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త కత్తిమండ ప్రతాప్, జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం, పాఠశాల హెచ్‌ఎం రత్న పద్మావతి, సీవీ రామన్ సైన్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు పసుపులేటి మెహర్‌సుజాత పాల్గొన్నారు. ద్రాక్షారామలో దంత వైద్యురాలు డాక్టర్ హరిప్రియ మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు.



కె.గంగవరంలో ర్యాలీ చేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సూర్యారావు తదితరులు



కాజులూరులో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న విద్యార్థులు



ద్రాక్షారామలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న డాక్టర్ హరిప్రియ

చవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వరరావు, సీఐ అశోక్‌కుమార్

రామచంద్రపురం రూరల్: మండలంలో వినాయక చవితికి మండపాలు ఏర్పాటు చేసి ఆలయ కమిటీలు సింగిల్ విండో ద్వారా అనుమతులు పొందిన తరువాత మాత్రమే విగ్రహాలను ఏర్పాటు చేయాలని రామచంద్రపురం తహసీల్దార్ మైలా వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఓలు, మహిళా పోలీసులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్‌తో పాటు రామచంద్రపురం సీఐ కడియాల అశోక్‌కుమార్, ఎస్సై పాటి వాసు, ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్, ఈఓపీఆర్డీ ఎస్.సెలత్‌రాజు పాల్గొని ఉత్సవాల నిర్వహణపై అవగాహన కల్పించారు. పరిధిని మించి సౌండ్ సిస్టమ్ ఉపయోగించకూడదని, మట్టి విగ్రహాలను ఉపయోగించాలని సూచించారు. గణేశ్ నిమజ్జనం రోజున ఊరేగింపు సమయంలో రోడ్లపై ప్రజారవాణాకు ఆటంకం కలగకుండా చూడాలని, డీజేలు ఏర్పాటుకు చేయవద్దని సూచించారు.

ఆరు గణపతి మంటపాలకు తాపేశ్వరం లడ్డూలు

మండపేట: గణపతి నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని ఈ ఏడాది రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఆరు గణనాథుని మంటపాలకు ఉచితంగా లడ్డూ ప్రసాదాలను పంపుతున్నామని మండలంలోని తాపేశ్వరం సురుచి ఫుడ్స్ అధినేత పోలిశెట్టి మల్లికార్జునరావు (మల్లిబాబు) తెలిపారు. శుక్రవారం తాపేశ్వరంలోని సురుచి మెయిన్ బ్రాంచ్‌లో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ వినాయకునికి 36 కిలోలు, ఫిల్మ్ నగర్ వినాయకునికి 108 కిలోల లడ్డూ ప్రసాదాన్ని పంపుతున్నామన్నారు. అలాగే విశాఖపట్నానికి 52 కేజీలు, బిక్కవోలుకు 50 కిలోలు, అయినవిల్లికి 50 కిలోలు, రామచంద్రపురానికి 50 కిలోల లడ్డూ ప్రసాదాన్ని ఉచితంగా పంపుతున్నామని ఆయన వివరించారు. కాగా విజయవాడ వరద బాధితులకు తమ సురుచి శాఖల ఆదివారం నాటి ఆదాయాన్ని విరాళంగా ఇవ్వాలని నిర్ణయించామన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా తమ సంస్థకు ఏడు బ్రాంచీలు ఉన్నాయన్నారు. ఆదివారం ఆ శాఖల్లో వచ్చే ఆదాయాన్ని వరద బాధితులకు అందజేస్తామన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థినులు

రాజోలు: రాష్ట్ర స్థాయి ఉపన్యాస, వ్యాచరచన పోటీలకు రాజోలు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ టి.లలితకుమారి తెలిపారు. వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో పదో తరగతి విద్యార్థినులు జె.కీర్తన ఎస్.రత్నవల్లీ, జె.స్నేహిత, తొమ్మిదో తరగతి విద్యార్థినులు సీహెచ్ వసంతలక్ష్మి, సౌభాగ్యలక్ష్మి, ఎం.జోయల్ మెర్సీ గెలుపొంది, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. డీఈఓ కమలకుమారి, ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు వీరికి ప్రశంసాపత్రాలు అందజేశారు.

రెండోసారి..వరద ముంచెత్తి..

- నీట మునిగిన అప్పనపల్లి కాజ్‌వే
- ప్రజలకు తప్పని అవస్థలు
- ట్రాక్టర్లపై సాగిస్తున్న రాకపోకలు



ముంపు బారిన పడిన అప్పనపల్లి కాజ్‌వే

మామిడికుదురు: గోదావరి వరద ఉధృతి ఈ ఏడాది రెండోసారి లంక గ్రామాలను ముంచెత్తింది. దీంతో అనేక గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. ప్రధాన రహదారులను శుక్రవారం వరద నీరు ముంచెత్తడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాశర్లపూడి కరకట్ట దిగువన ఉన్న అప్పనపల్లి కాజ్‌వేపై భారీగా వరద నీరు ప్రవహిస్తోంది. ఇక్కడ నాలుగడుగుల మేర వరద నీరు పొంగి ప్రవహిస్తోంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలను నిలిపివేశారు. దీంతో అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెదపట్నం గామంతో పాటు, పాశర్లపూడి, పాశర్లపూడిలంక గ్రామాల్లోని మత్స్యకార కాలనీలను వరద నీరు చుట్టుముట్టింది. పెదపట్నం మధ్య లంక పూర్తిగా ముంపు భారిన పడింది. అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాల్లో కొబ్బరి కాయలు దింపు తీసి రెండెడ్ల బళ్లపై సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవడంలో రైతులు ఇబ్బందులు పడ్డారు. ఎండుగడ్డి ముంపు భారిన పడకుండా భవనాలపై దాచుకున్నారు. గోదావరి వరద మరింత పెరుగుతున్న నేపథ్యంలో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఖమ్మం జిల్లా భద్రాచలం వద్ద వరద తగ్గుముఖం పట్టడంతో తీర గ్రామాల ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకున్నారు.

ఉధృతంగా నదీ పాయలు

పి.గన్నవరం: భద్రాచలం వద్ద వరద స్వల్పంగా తగ్గుముఖం పట్టినప్పటికీ, కోనసీమలోని వశిష్ఠ, వైనతేయ, గౌతమీ నదీపాయలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్ వేపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అక్కడ పడవలను ఏర్పాటు చేశారు. మానేపల్లి శివారు శివాయలంకకు వేళ్లే రహదారి మునిగిపోవడంతో ట్రాక్టర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో ఆ గ్రామ ప్రజలు సుమారు రెండు కి.మీ. మేర ట్రాక్టర్‌పై ప్రయాణించి మానేపల్లికి వస్తున్నారు. మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెల వారిలంక, బూరుగులంకలతో పాటు, ఉభయ గోదావరి జిల్లాల సరిహద్దులో ఉన్న పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పెదమల్లంక, ఆనగర్లంక, సిర్రా వారిలంక, అయోధ్యలంక గ్రామాల ప్రజలు కూడా పడవలపై బయటకు వస్తున్నారు. పి.గన్నవరం తహసీల్దార్ శ్రీపల్లవి ట్రాక్టర్‌పై శివాయలంకకు వెళ్లి వరద పరిస్థితిని పరిశీలించారు.

చుట్టుముట్టిన వరద

సఖినేటిపల్లి: ధవళేశ్వరం వద్ద తొలి ప్రమాద హెచ్చరిక నేపథ్యంలో శుక్రవారం మండలంలో అప్పనరాములంక, టేకిశెట్టిపాలెం గ్రామాల పరిధిల్లోని గోదావరి పాయను అనుకుని ఉన్న లోతట్టు ప్రాంతాలను, కొబ్బరి తోటలను వరద నీరు చుట్టుముట్టింది. దీంతో అప్పనరాముని లంక, టేకిశెట్టిపాలెం గ్రామాల మధ్య గోదావరి పాయపై నూతనంగా నిర్మించిన కాజ్ వే వద్ద, అలాగే అప్పనరామునిలంక, సఖినేటిపల్లి గ్రామాల మధ్య మరో కాజ్ వే వద్ద పోటెత్తిన వరదతో ఆయా మార్గాల్లో రాకపోకలు స్తంభించాయి. అప్పనరామునిలంక వాసులు రామరాజులంక మీదుగా ఉన్న మరో మార్గంలో ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారు. గోదావరి పాయను ఆనుకుని టేకిశెట్టిపాలెం వైపు ఉన్న అగ్నికుల క్షత్రియ కాలనీకి, టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద ఉన్న ఆంజనేయ స్వామివారి ఆలయం వైపున కూడా వరద నీరు పోటెత్తింది.